అవగాహన కల్పించి.. బహుమతులు అందజేసి

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే : అగ్నిపథ్ పథకాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు సందీప్, సుధీరలు సూచించారు. పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో మంగళవారం హైదరాబాద్ బేగంపేట్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2022లో ఈ పథకాన్ని తీసుకొచ్చిందని, 17-21 సంవత్సరాల యువతకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. గతంలో ఎయిర్‌ఫోర్స్‌లో చేరేందుకు మహిళలకు అవకాశం ఉండేదికాదని, ప్రస్తుతం వారికి సైతం అవకాశం కల్పించారన్నారు. మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని, నాలుగు సంవత్సరాల పనితీరు అనంతరం మెరుగైన ప్రతిభ కనబర్చిన 25 శాతం మందిని కొనసాగిస్తారని, 75 శాతం మందికి రూ.12 లక్షలు చెల్లించి పంపిస్తారని వివరించారు. ఆ మొత్తం ఇతర వ్యాపారాలు తదితర వాటికి ఉపయోగించుకుని స్థిరపడవచ్చన్నారు. జనవరి 25న హైదరాబాద్‌లో ఎంపిక ర్యాలీ ఉంటుందని, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ర్యాలీలో పాల్గొంటే ఎంపికకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఉత్తమ సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా ఉపాధికల్పనాధికారి రవికృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రకాష్, కళాశాల అధ్యాపకులు దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎయిర్‌ఫోర్స్ అధికారులు సందీప్, సుధీర

స్థలం కొనేముందు.. అప్రమత్తతే మందు

నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని ఇటీవల నస్పూర్‌కు చెందిన డీకొండ అన్నయ్యకు చెందిన ఇంటిని ఒక సర్వే నంబరులో భూమి కొని మరో సర్వే నంబరులో నిర్మించారనే కారణంతో మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. అయితే నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణం చేపట్టానని బాధితుడి ఆరోపణ. భూమి కొనుగోలు సమయంలో అప్రమత్తంగా ఉంటే ఇలా జరిగి ఉండేది కాదని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.



దండేపల్లి మండలం లింగాపూర్‌కు చెందిన హరినాయక్‌ను భూమి పట్టాదారుల ఫోర్జరీ సంతకాలతో పట్టా చేయించుకున్నాడని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే పట్టాదారు సంతకాలతో కొన్నేళ్ల క్రితమే పట్టా జరిగిందని హరినాయక్ వాదన. సరైన జాగ్రత్తలు పాటిస్తే బాగుండేదని అధికారులు సూచిస్తున్నారు. పైన పేర్కొన్నవి ఒక్క జిల్లాలోనే కాదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇలాంటి ఘటనలు ఇటీవల తరచూ చోటు చేసుకుంటున్నాయి.

దండేపల్లి గ్రామీణం, లక్సెట్టిపేట, న్యూస్‌టుడే

స్థలం కొనుగోలు చేసేప్పుడు సరైన జాగ్రత్తలు పాటించకపోవడం, పత్రాలు సరిగ్గా చూసుకోకపోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉంటాయి. అధికారులు తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీంతోపాటు స్థలాన్ని నష్టపోయే అవకాశాలున్నాయి. ఇటీవల రాజధానిలో హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను కూల్చివేస్తోంది. జిల్లాల్లోనూ ప్రజల్లో భూముల కొనుగోళ్లపై సవాలక్ష అనుమానాలు తలెత్తుతున్నాయి. భూమి కొనుగోలు చేసేటప్పుడు వాటి పట్టా, రిజిస్ట్రేషన్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పట్టా అయిన తర్వాత దాన్ని కాపాడుకునే విధానాలపై విశ్రాంత కలెక్టర్ శర్మన్‌నాయక్, సబ్‌రిజిస్ట్రార్‌ల సూచనలు, సలహాలు ఇచ్చారు.





జీపీఎస్ మ్యాప్ కెమెరాతో ఇట్టే తెలుసుకోవచ్చు

ఇక్కడ కనిపిస్తున్న చిత్రం జీపీఎస్ మ్యాప్ కెమెరా యాప్ ద్వారా చిత్రీకరించింది. మనం కొనుగోలు చేసిన ప్రదేశాన్ని గుర్తించడానికి ఇది తోడ్పడుతుంది. భూమి వద్దకు వెళ్లి ఫొటో తీయడం ద్వారా మనం ఉన్న ప్రదేశం అక్షాంశాలు, రేఖాంశాలు, సర్వే నెంబరు, లేదా ప్లాటు నెంబరు మనకు కనిపిస్తుంది. దాన్ని చిత్రీకరించడం ద్వారా ఫొటోపై వివరాలు నమోదవుతాయి.

ప్రభుత్వ స్థలమా, పట్టానా చూసుకోవాలి



- భూమి కొనుగోలు చేసే సమయంలో ప్రభుత్వ స్థలమా, పట్టానా అనేది మొదటగా చూసుకోవాలి.
- తహసీల్దార్ కార్యాలయంలో కొనుగోలు భూమికి సంబంధించి రికార్డులు, పహాణీలను సరి చూడాలి.
- భూమి విక్రయించే వ్యక్తిపైనే పట్టా ఉందా, మనం కొనుగోలు చేసే భూమి అతడికి సంబంధించినదేనా అనేది పరిశీలించాలి.
- కొనుగోలు చేసిన భూమి, పట్టా భూమి ఒకటేనా అనే దానిపై సర్వే నంబర్లను పోల్చి చూడాలి.
- మొదటగా 15 ఏళ్ల క్రితం పహాణీలు, విక్రయదారునికి భూమి ఎలా వచ్చింది, వారసత్వమా, కొనుగోలా వంటివి జాగ్రత్తగా చూసుకోవాలి.
- కొనుగోలు తర్వాత హద్దురాళ్లు ఏర్పాటు చేసుకోవాలి.

శర్మన్‌నాయక్ విశ్రాంత కలెక్టర్

కొనుగోలు సమయంలో సరిచూసుకోవాలి



- భూమి క్రయ, విక్రయాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కొనుగోలుదారునిదే.
- లింకు డాక్యుమెంట్లు లేకుండా భూమి కొనుగోలు చేయడం సరికాదు.
- భూమి కొనుగోలు చేసే సమయంలో సర్వే నెంబరు, లోకేషన్, హద్దులు కచ్చితంగా చూసుకోవాలి.
- భూమికి నాలుగువైపులా ఉన్న యజమానులను విచారించడం ద్వారా మోసపోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది.
- కొనుగోలు చేసే ముందు ఇ.సి.ద్వారా భూమిపై లావాదేవీలు తెలుసుకోవచ్చు.
- ఓపెన్ ప్లాట్లకు డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలి. ఇంటి రిజిస్ట్రేషన్ సమయంలో నిర్మాణ అనుమతి పత్రం, టీఎస్‌బీపాస్ నుంచి అనుమతులు తీసుకున్న పత్రం సరిచూసుకోవాలి.
- చెరువు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భూమి ఉందా తెలుసుకోవడానికి నీటిపారుదలశాఖ, రెవెన్యూ శాఖల ద్వారా వివరాలు పొందవచ్చు.
- డబుల్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంటు ఆధారంగా సరి చూసుకునే వెసులుబాటు ఉంది.
- తాజాగా ఐజీఆర్ఎస్-తెలంగాణ పోర్టల్ ద్వారా భూమి స్వభావాన్ని తెలుసుకునే వీలు ప్రభుత్వం కల్పించింది.

జి.సాయికుమార్, సబ్ రిజిస్ట్రార్, లక్సెట్టిపేట

ధోబీఘాట్.. హాంఫట్!

● కాగజ్‌నగర్‌లో యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా

కాగజ్‌నగర్, కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాల కబ్జా నిరంతరాయంగా కొనసాగుతోంది. నాలాలు, ధోబీఘాట్లు ఆక్రమిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు చేసినా జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

కొనసాగుతున్న నిర్మాణం

పట్టణంలోని రజకుల సౌకర్యార్థం 1987లో ధోబీ ఘాట్లతోపాటు దుస్తులు ఆరేయడానికి సరిపడా రెవెన్యూ అధికారులు ద్వారకానగర్‌లోని సర్వే నంబర్ 53లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. 2023లో అప్పటి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఈ స్థలంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఏటా వర్ధంతి, జయంతి ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. మొన్నటి వరకు సైతం ఇది సర్కారు భూమిగానే ఉంది. ఇటీవల ఓ వ్యాపారి తాను కొనుగోలు చేశానని, ధోబీఘాట్ స్థలాన్ని కొంత కబ్జా చేసి నిర్మాణాలు కొనసాగిస్తున్నాడు. ప్రభుత్వ భూమి పక్కన పట్టా భూమి ఉందని సదరు వ్యాపారి రజకులను అడ్డుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. తమకు కేటాయించిన ప్రభుత్వ భూమికి హద్దులు నిర్ణయించాలని సర్వేయర్‌కు నివేదించగా.. సర్వే చేయకుండా అలా వచ్చి ఇలా వెళ్లిపోయాడని రజక సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఓ రజక సంఘం నాయకుడు ధోబీఘాట్ స్థలం పక్కన భూమి ఎవరి పేరున పట్టా ఉంది? సదరు వ్యాపారికి ఎలా సంక్రమించిందనే విషయాలను కోరుతూ.. సమాచార హక్కు చట్టం ద్వారా కోరినప్పటికీ సమాధానం ఇవ్వడం లేదని వాపోతున్నారు. సమాచారం ఇవ్వకుండా అధికారులు పరోక్షంగా సదరు వ్యాపారికి సహకరిస్తున్నారని రజక సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ వివాదాస్పద భూమిపై అధికారులు ఇప్పటి వరకు వాస్తవాలను తేల్చకుండా కాలం వెళ్లదీస్తూ తీవ్ర జాప్యం చేయడంపై త్వరలోనే ఆందోళనబాట పడతామని నాయకులు పేర్కొంటున్నారు.

☛ ఈ విషయంపై పురపాలిక కమిషనర్ అంజయ్యను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. ధోబీఘాట్ స్థలం ప్రభుత్వ భూమేనని, సమీపంలోని స్థలం ధరణి రికార్డుల్లో ఉన్నట్టు రెవెన్యూ అధికారులు పట్టాపాస్‌బుక్ సైతం అందజేశారని చెప్పారు. అది ఎలా ధరణిలో నమోదైందో తమకు తెలియదని తెలిపారు.


రజక సంఘానికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో 1987 నాటి శిలాఫలకం


ద్వారకానగర్‌లోని ధోబీఘాట్, పక్కనే కొనసాగుతున్న నిర్మాణ పనులు

ఆక్రమణలతో కుచించుకుపోయిన 'నాలా'

కాగజ్‌నగర్ బల్దియాలో 30 వార్డులు ఉండగా 57,426 మంది నివసిస్తున్నారు. కొంత మంది నాయకులు, వ్యాపారులు ఇష్టానుసారంగా భూకబ్జాలకు పాల్పడుతున్నారు. పట్టణం మధ్య నుంచి వెళ్లే ప్రధానమైన నాలా ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ప్రారంభమై రైల్వే ట్రాక్ వరకు ఉంటుంది. ఈ నాలాకు వివిధ వార్డుల నుంచి వచ్చే మురుగు కాలువలను అనుసంధానం చేశారు. వెంకటరమణ థియేటర్ ఎదురుగా, నౌగాంబస్తీ సమీపంలో, తీరందాజ్ టాకీస్ వెనుకగేటు సమీపంలో, ఎల్లగౌడ్‌తోట సమీపంలో, ఓ ఫంక్షన్‌హాల్ సమీపంలో స్థలం ఆక్రమణలకు గురైంది. ఒకప్పుడు 30 అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ నాలా ప్రస్తుతం 15 అడుగులకు కుచించుకుపోయింది. భారీ వర్షాలు కురిసిన సందర్భంలో నౌగాంబస్తీ, సంజీవయ్యకాలనీ, ద్వారకానగర్, కన్యకాపరమేశ్వరి ఆలయ సమీప కాలనీలు ముంపునకు గురవుతున్నాయి.

నిధుల్లేక.. పనులు సాగక!

● గ్రామ పంచాయతీల నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు

కౌటాల, న్యూస్‌టుడే

జిల్లాలోని గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొద్ది నెలలుగా పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ముఖ్యంగా ఆదాయ వనరులు అంతగా లేని చిన్న పంచాయతీల్లో కనీసం కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం-పచ్చదనం, త్వరలో నిర్వహించే బతుకమ్మ సంబరాలకు నిధుల లేమి సమస్యగా మారే అవకాశం ఉందంటూ.. సోమవారం కౌటాల మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ఎంపీఓకు వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి పంచాయతీలో నిధుల కొరత తీవ్రంగా ఉందని కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీలు 335

మండలాలు 15

పంచాయతీ కార్యదర్శులు 275

నోట్: గ్రామ పంచాయతీలకు ఏడాది కాలంగా నిధులు మంజూరు కాలేదు.

ఈ ఏడాది జనవరి నెలలో కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు కొద్ది మేర గ్రామపంచాయతీ ఖాతాలలో జమ య్యాయి. వాటితో పంచాయతీ కార్యదర్శులు కొన్ని నెలలుగా నెట్టుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎస్ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) నిధులు సైతం గత కొన్ని నెలలుగా విడుదల కాలేదు. గతంలో సర్పంచులు గ్రామాల్లో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించాల్సి ఉంది. అదేవిధంగా బ్లీచింగ్, వీధి లైట్లు, చేతిపంపుల సామగ్రి కొనుగోలు, పంచాయతీ నిర్వహణ ఖర్చులు సైతం ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ప్రత్యేకాధికారులు సైతం పంచాయతీ పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో పూర్తిస్థాయిలో బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులపై పడటంతో వారు అప్పులు చేసి పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

గాడితప్పిన పాలన..

గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో.. ప్రభుత్వం ఫిబ్రవరి 2న ప్రత్యేకాధికారులను నియమించింది. నిధుల లేమి, సిబ్బంది జీతాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పంచాయతీల పాలన గాడితప్పుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగు కాలువల్లో పూడికతీత, విద్యుత్తు దీపాల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలు ఇలా.. అనేక సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రత్యేకాధికారులు సైతం చేసేదేమీ లేక పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏదో మొక్కుబడిగా పది రోజులకోసారి పంచాయతీ కార్యాలయాలకు వచ్చి వెళ్తున్నట్లు తెలుస్తోంది. పంచాయతీలో ఏదైనా అత్యవసర పనులుంటే కార్యదర్శులపైనే ప్రత్యేకాధికారులు భారం మోపుతున్నారు.


వీర్దండి గ్రామపంచాయతీ కార్యాలయం

ఉన్నతాధికారులకు విన్నవించాం

- కోట ప్రసాద్, ఎంపీడీఓ, కౌటాల

గ్రామపంచాయతీల్లో నిధుల కొరత ఉన్న మాట వాస్తవమే. పంచాయతీల నిర్వహణ భారంగా మారుతోంది. రాబోయే బతుకమ్మ వేడుకలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ ఇప్పటికే ఉన్నతాధికారులకు విన్నవించాం.

గురుకులం.. శుద్ధజలానికి దూరం

తిర్యాణి, న్యూస్‌టుడే

మండలంలోని గిరిజన గురుకుల బాలికల, కళాశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 535 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గురుకుల భవనం నిర్మించినపుడు ఆవరణలో అయిదు బోర్లు వేసినా ఒక్కదానిలోనూ చుక్కనీరు పడలేదు. ఈ ప్రాంతమంతా గుట్టలు, బండల రాళ్లతో నిండి ఉండటమే కారణం. భవనంలో గురుకుల పాఠశాల ప్రారంభించినప్పటి నుంచి అధికారులు నాయకపుగూడ గ్రామంలో బోర్‌కు మోటారు బిగించి అక్కడి నుంచి గురుకులం పాఠశాల వరకు పైపులు వేసి నీటిని వాడుకుంటున్నారు. విద్యార్థులు ఆ నీటినే తాగునీటికి, దుస్తులు ఉతుక్కోవడానికి, స్నానాలు, తదితర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. విద్యుత్తు సరఫరాకు ఆటంకం ఏర్పడితే ఆ రోజు విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం. గతంలో కొన్ని రోజులు తాగునీటి కోసం మిషన్ భగీరథ నీరు సరఫరా చేసిన అధికారులు.. ఈ విద్యా సంవత్సరం నుంచి చేయడం లేదని విద్యార్థులు తెలిపారు. శుద్ధజల యంత్రం తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో.. మూలకు పడేశారు. పాఠశాలకు శుద్ధజల యంత్రం, జనరేటర్ మంజూరు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

☛ ఈ విషయంపై గురుకుల ప్రిన్సిపల్ రమ్మను వివరణ కోరగా.. తాగునీటి సమస్యపై జిల్లా పాలనాధికారికి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ప్రైవేటు నుంచి నిత్యం 60 లీటర్ల వరకు కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.


పనిచేయని శుద్ధజల యంత్రం



నిల్వ చేసిన బోరునీటిని తాగడానికి సీసాలో పట్టుకుంటున్న విద్యార్థులు

వన్యప్రాణుల నుంచి 'రక్ష'ణ!

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలో అటవీ ప్రాంత సమీపంలో ఉన్న చేన్లలో పత్తితో పాటు ఇతర పంటలు సాగుచేశారు. అవి పూత, కాత దశలో ఉన్నాయి. అయితే అటవీ పందులతో ప్రమాదం పొంచి ఉంది. వన్యప్రాణులు రాకుండా, పంట రక్షణ కోసం రైతులు జాలీలు కొనుగోలు చేసి చేను చుట్టూ అమర్చుకుంటున్నారు. దుకాణాల్లో కిలోకు రూ.350లు చెల్లించి పంటను కాపాడుకునే చర్యలు తీసుకుంటున్నారు. జాలి ఏర్పాటుతో చేనులోకి వన్యప్రాణులు రావడంలేదని రైతులు తెలిపారు.


పత్తి చేను చుట్టూ జాలి ఏర్పాటు చేశారిలా..

సహకార సంఘాలకు నోటీసుల దడ

● పెనుభారంగా ఆదాయపు పన్ను.. జీఎస్టీ

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం

ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లావాదేవీలు, క్రయవిక్రయాలు తదితర వాటిపై ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసులు రావడంతో సంఘాలు కంగుతిన్నాయి. ఇప్పుడిప్పుడే ఎరువులు, విత్తనాల విక్రయాలతోపాటు, రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ, ఆదాయాన్ని సమకూర్చుకుంటూ.. నిలదొక్కుకుంటున్న సంఘాలకు ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు రావడంతో సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. క్రయవిక్రయాలపై వచ్చే ఆదాయంపై పన్ను చెల్లించాలని ఐటీ, సంఘాలు నిర్వహించే సేవా రంగాలు, వ్యాపార లావాదేవీలకు జీఎస్టీ నోటీసులు రావడంతో సంఘాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలో వివిధ సహకార సంఘాలకు రూ. 5లక్షలనుంచి రూ. కోటి వరకు చెల్లించాలని ఈ నోటీసుల్లో పేర్కొనడంతో సంఘాలు విస్తుపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలోని 77 సహకార సంఘాలు రైతుల కోసం పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. గతంలో సంఘాలు కేవలం పంట రుణాల తదితర వాటికి పరిమితం కావడం, బినామీ పేరుతో చాలా మంది రుణాలు తీసుకోవడంతో సంఘాలు నష్టాల్లో కూరుకుపోయాయి. ఇప్పటికీ 20కి పైగా సంఘాలు నామమాత్రంగానే ఉన్నాయి. కొన్ని సంఘాలు ఎరువులు, విత్తనాలు విక్రయించడం, రైతుల నుంచి కమీషన్‌తో పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం, పెట్రోల్ బంకులు, సూపర్ మార్కెట్లు నిర్వహించి, ఆదాయాన్ని పెంచుకొని నిలదొక్కుకుంటున్నాయి. కొన్ని సంఘాలు రైతుల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు చేసే డిపాజిట్లు, తీసుకునే వడ్డీ పైనా పన్ను చెల్లించాలని ఆదాయ పన్ను శాఖ నోటీసులు ఇచ్చింది. ఈ నోటీసులపై స్పందించిన సహకార సంఘాలు కమిషనర్‌ను కలిసి రైతుల సేవలకు సంబంధించిన లావాదేవీలపై ఆదాయ పన్ను మినహాయించాలని వినతిపత్రం ఇచ్చినట్లు సహకార సంఘం అధ్యక్షుడు పండరి తెలిపారు.





జీఎస్టీ పరిధిలోకి..

వాణిజ్య పన్నుల శాఖ గతంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండేది. అప్పుడు సంఘాలు నిర్వహించే వాటిపై పన్ను ఉండేది కాదు. 2017 జులై 1 నుంచి వాణిజ్య పన్నుల శాఖ పరిధిలోని పన్నుల వసూళ్లు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని జీఎస్టీ కిందకు వెళ్లాయి. ఎరువుల విక్రయాలపై 5 శాతం, పురుగు మందుల విక్రయాలపై 18 శాతం పన్నును సంఘాలు జీఎస్టీ రూపంలో చెల్లించాల్సి వస్తోంది. గతంలో మాదిరిగానే సంఘాలు ఆదాయ వ్యయాలకు సంబంధించి లెక్కలు చూపించడం లేదు. 2017 నుంచి 2021 వరకు సంవత్సరం వారీగా ఆదాయ వ్యయ వివరాలను తెలియజేయాలంటూ నోటీసులు రావడంతో సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జీఎస్టీ నోటీసుల నేపథ్యంలో సహకార సంఘాలు చార్టెడ్ అకౌంటెంట్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొని సంవత్సరం వారీగా ఆదాయ, వ్యయ లెక్కలు అప్పజెప్పే పనిలో ఉన్నాయి.

జిల్లాల వారీగా సహకార సంఘాలు

జిల్లా	ఆదిలాబాద్	నిర్మల్	మంచిర్యాల	కుమురంభీం
సంఘాలు	28	17	20	12
సభ్యులు	59,493	46,928	47,474	23,788

కుమురంభీం వర్ధంతికి పకడ్బందీ ఏర్పాట్లు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జోడేఘాట్‌లో అక్టోబర్ 17న కుమురంభీం వర్ధంతి, దర్బార్ కార్యక్రమాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జయప్రదం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఐటీడీఏ పీఓ ఖుష్బూ గుప్తా, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లలతో కలిసి పాల్గొని మాట్లాడారు. హాజరయ్యే ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. ఐటీడీఏ, విద్య, పోలీసు శాఖలు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జోడేఘాట్, పరిసర గ్రామాల్లో విద్యుత్తు అంతరాయం లేకుండా అధికారులు చొరవచూపాలని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పవర్‌గ్రిడ్, మిషన్ భగీరథ శాఖలు సమన్వయంతో ప్రజలకు శుద్ధనీరు అందించేలా చూడాలన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో సాధారణ అవసరాలకు నీటి సరఫరా చేయాలన్నారు. అక్కడ ఏర్పాట్లపై ఆయా శాఖలకు బాధ్యతలు కేటాయించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, చిత్రంలో అదనపు కలెక్టర్, ఐటీడీఏ పీవో, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్, తదితర అధికారులు

కొంగ తెల్లన.. తల నల్లన



పంట పొలాల్లో గడ్డి కోసం పశువులు, గింజల కోసం పక్షులు రావడం సహజం. కానీ ఇక్కడ గింజలు లేవు పచ్చని పచ్చిక మాత్రమే ఉంది. మరి పచ్చికలో ఈ పక్షులకు పనేంటి అనుకుంటున్నారా.. సారంగాపూర్ మండలం చించోలి గ్రామ శివారులోని పంట పొలంలో కనిపించిన తెల్లని శరీరం, నల్లని తల కలిగిన ఈ పక్షులను ఇబిస్ కొంగలు అంటారు. వీటి శాస్త్రీయ నామం థ్రిస్ కిరోనిస్ మెలనో సెఫాలస్. దేశమంతటా తిరుగుతూ పచ్చని, తడి నేల ప్రాంతాల్లో క్రిమి కీటకాలు, మట్టిలోని చిన్న చిన్న పురుగులను ఆహారంగా తీసుకుంటాయని ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రం అసోసియేట్ ప్రొఫెసర్ వెల్మల మధు తెలిపారు.

- చిత్రం: న్యూస్‌టుడే, నిర్మల్

'యూబిట్ కాయిన్' వ్యవహారంలో పోలీసుల అదుపులో ఉపాధ్యాయుడు

సొనాల(బోథ్), న్యూస్‌టుడే : బోథ్ మండలం సొనాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని యూబిట్ కాయిన్ వ్యవహారంలో నిర్మల్ జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే నిర్మల్ జిల్లా పోలీసులు సొనాలలోని రామాలయం కాలనీలో రెక్కీ నిర్వహించారు. ఉదయం 6 గంటల ప్రాంతంలో ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లారు. సదరు ఉపాధ్యాయుడు యూబిట్ కాయిన్ వ్యవహారంలో సభ్యులను ఈ వ్యాపారంలో చేర్చుతూ స్టార్ రేటింగ్ పొందినట్లు సమాచారం. సొనాల, బోథ్ చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు నిర్మల్ జిల్లాలోని పలు మండలాల్లోని తన బంధువులను ఈ వ్యవహారంలోకి లాగి రూ.లక్షల్లో నగదును పెట్టుబడిగా పెట్టించినట్లు సమాచారం. పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే విషయం తెలియడంతో ఈ వ్యాపారంలో పెట్టుబడి పెట్టిన పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు.



విద్యార్థులకు ఉచిత శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించాలి

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందించాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని బంగారుగూడ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇన్సినరేటర్ యంత్రం, శానిటరీ ప్యాడ్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. లెర్నింగ్ కర్వ్, భారత్ పెట్రోలియం కెమికల్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా జిల్లాలోని 18 కస్తూర్బాలకు ఉచితంగా ఇన్సినరేటర్ యంత్రాలు(శానిటరీ ప్యాడ్లను కాల్చివేసే యంత్రం), ఏడాదికి సరిపడా శానిటరీ ప్యాడ్లను విద్యార్థులకు అందించారు. వాటిని జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇన్సినరేటర్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించి పర్యావరణ పరిరక్షణలో దాని పాత్రను తెలిపారు. విద్యార్థులు కౌమార దశలో ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దన్నారు. అనంతరం విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. డీఈవో ప్రణీత, కేజీబీవీల సంయుక్త అధికారి ఉదయశ్రీ, లెర్నింగ్, బీపీసీఎల్ సంస్థ ప్రతినిధులు స్వప్న, మోనిష్‌రెడ్డి, నాగరాజు, ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆ గడియారం ఆగదు

కబీర్‌దాస్ మాటలు గుర్తు చేసుకుంటే..

'రేపు చేయాల్సిన పని ఈ రోజే చేయి. ఈ రోజు చేయాల్సిన పనిని ఇప్పుడే చేసెయ్..' అని సంత్ కబీర్‌దాస్ చెప్పిన మాట ఇప్పటికీ గుర్తు చేసుకుంటామంటే 'కాలం' ఎంత విలువైందో కదా..



జీవితంలో ఏదైనా సాధించాలంటే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెబుతారు. సక్సెస్ సాధించిన వారి గురించి వివరిస్తూ ఎవరికైనా 24 గంటల సమయమే ఉంటుంది.. దాన్ని ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకుంటే విజయం సాధిస్తారని యువతను, విద్యార్థులను ఉద్దేశించి చెబుతారు.

అందరికీ అంతే కదా..

విజయం వెనక సమయం:



రోగిని పరీక్షిస్తున్న డా.రమాదేవి

మాది నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బీరవెల్లి. వ్యవసాయ నేపథ్యమున్న అమ్మానాన్నలు కష్టపడి నన్ను చదివించారు. ఒక సాధారణ కుటుంబం నుంచి నేను ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇప్పుడు ఉస్మానియాలో పీజీ(గైనకాలజీ) చేస్తున్నానంటే దాని వెనక ఎంతో ప్రణాళిక ఉంది. ఎక్కడా సమయం వృథాచేయలేదు. వృత్తిలోనూ నాడి పట్టడం, తక్షణ చికిత్స అందించాల్సిన పరిస్థితిల్లో సమయమే ప్రధానం. -డా.రమాదేవి

● ఎవరికైనా సమయం 24 గంటలే

నెపోలియన్

గాఢంగా నిద్రపోతున్నప్పుడు సైన్యాధిపతి వచ్చి 'శత్రుసైన్యం దక్షిణ దిక్కునుంచి చొచ్చుకొస్తోందని' చెబుతాడు. చటుక్కున నిద్రలేచి 'అవునా అయితే ఆ గోడ మీద రాసిన 64వ నంబరు పద్ధతిలో శత్రువుల్ని ఎదుర్కోండి' అని అప్రమత్తం చేస్తాడు. ఏ సమయంలో ఎలా వ్యవహరించాలో ముందుగానే ప్రణాళిక చేసుకుంటే కాలం కలిసొస్తుందనేందుకు ఇది సరిపోదా..

అదును దాటితే చీడతో పీడనే..

ఏ సమయంలో చేయాల్సిన పనిని ఆ సమయంలోనే చేయాలంటారు. ఇది రైతన్న విషయంలోనూ చాలా కీలకమే. విత్తనాలు వేయడం మొదలు కొని కలుపు తీయడం, ఎరువులు, మందులు చల్లడం వంటివి సమయానుకూలంగా చేయకపోతే చీడపీడలు నష్టం కలిగిస్తాయి.



పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

నిమిషం నిబంధన తెలుసుగా..

ఆ టైమ్‌ది ఏముందిలే ఓ గంట అటూఇటూ అని తేలిగ్గా కొట్టిపారేస్తే కుదరదండోయ్. గంట కాదు నిమిషం కూడా ఎంత కీలకమో 60 సెకన్లు ఆలస్యంగా వెళ్లి వెనుదిరిగి పోటీ పరీక్ష రాయలేకపోయిన అభ్యర్థులను అడిగి చూడండి సమయం విలువ ఏంటో చెబుతారు.

జీవితంలో ప్రతీది సమయంతో సంబంధమున్నదే. రోజూ అన్నీ దాదాపు గడియారంకేసి చూస్తూ చేసే పనులే. ఏయ్ తెల్లారింది బడికి టైం అవుతుందని అమ్మ పిల్లల్ని నిద్రలేపడం. ఏమోయ్ నేను ఆఫీసుకి గంట ముందే వెళ్లాలి త్వరగా టిఫిన్ చేసేయ్ అని భర్త చెప్పడం.. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి పంపించరని విద్యార్థులు ముందుగానే అప్రమత్తమయ్యేవన్నీ చూస్తూనే ఉంటాం. అంతెందుకు ఏ సమయంలో పుట్టాడు.. ఎప్పుడు మరణించాడు అనే ప్రశ్నలకూ 'టైమే' కదా సమాధానం.

-న్యూస్‌టుడే, మామడ

కానీ గడియారం ముల్లు గుచ్చుకుంటోంది..

నిర్మల్‌కు చెందిన మడిపల్లి దక్షిణామూర్తి రేడియో వ్యాఖ్యతగా వ్యవహరిస్తారు. వివిధ సందర్భాల్లో పలు అంశాలపై ఆయన మాట్లాడుతున్నప్పుడు 'ఈ విషయంపై మరింత లోతుగా.. వివరంగా చెప్పాలని ఉంది కానీ మా స్టూడియోలోని గడియారం ముల్లు నన్ను గుచ్చుకుంటోంది..' అంటూ నవ్వుతూనే తనకిచ్చిన సమయం పూర్తవుతోందని చెబుతుంటారు.

-మడిపల్లి దక్షిణామూర్తి






'తమ్ముడూ టైం అవుతోంది పదా'.. బడికెళ్లే ముందు సమయం చూసుకుంటున్న నిర్మల్‌కు చెందిన చిన్నారులు మనోమయి, మోక్షిత్

ఈ అలారమే నిద్రలేపేది..

'ఈ అలారం గడియారాన్ని నేను 1990లో కొనుగోలు చేశాను. విద్యార్థి దశలో నన్ను ఉదయాల్లో నిద్రలేపింది. ఉద్యోగంలో చేరాక ప్రయాణాలు చేయాల్సి వస్తే అది మోగించిన శబ్దమే దూరంగా ఉన్న గమ్యాన్ని సకాలంలో చేరేలా చేసింది. అందుకే ఇప్పటికీ ఇంట్లో భద్రంగా ఉంచాను..' దిల్లీలోని కెనడా రాయబార కార్యాలయంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఖానాపూర్‌కు చెందిన టి.సంపత్‌కుమార్ అలారంతో ఉన్న అనుబంధాన్ని వివరించారు.





నిర్మల్‌లో ఉన్న అమ్మానాన్నలు గంగాసాగర్ రెడ్డి-అరుణ కుమారుడితో మాట్లాడుతున్నప్పుడు రాత్రి 8.20 (వెనక గోడ గడియారంలో)

ఫోన్ చేయాలన్నా టైం చూసుకోవాల్సిందే..

సాధారణంగా మనకు ఉదయం పూట ఎవరైనా ఫోన్ చేస్తే గుడ్ మార్నింగ్ అంటుంటాం. కానీ పొద్దున్నే కాల్ వచ్చిన అన్ని సార్లు శుభోదయం చెప్పడం కుదరదు. విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి చాలా మంది విదేశాల్లో ఉంటున్నారు. వాళ్లు స్వదేశంలో ఉండే తల్లిదండ్రులు, బంధువులతో మాట్లాడాలంటే తప్పకుండా 'టైం' చూసుకుంటారు. రెండు దేశాల టైంజోన్ వేర్వేరుగా ఉంటుంది. మన సమయానుకూలంగా అక్కడ ఉన్న వాళ్లకు ఫోన్ చేస్తే వాళ్లు రాత్రి గాఢ నిద్రలో ఉంటారు.



న్యూయార్క్‌లో ఉన్న ప్రశాంత్‌రెడ్డి ఫోన్‌లో తల్లిదండ్రులతో మాట్లాడుతుండగా సమయం ఉదయం 10.49 (కంప్యూటర్ తెరపై)

అలిసిపోని గడియారం..

గడియారం రోజంతా పనిచేస్తూనే ఉంటుంది. కాసేపటికే అలసి పోయామనుకునే వారు వాచీ చూసి ఉత్తేజం తెచ్చుకోవచ్చు..



గంటల ముల్లు రోజులో రెండు సార్లు చుట్టూ తిరుగుతుంది..	నిమిషాల ముల్లు 24 సార్లు	సెకండ్ల ముల్లు 1440 సార్లు

సత్వర సేవల్లో బెల్లంపల్లి పోలీస్‌స్టేషన్ భేష్

● రాష్ట్రంలో మూడో స్థానం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలకు సత్వర సేవలు అందించినందుకు రాష్ట్రవ్యాప్తంగా పది పోలీస్ స్టేషన్లను ఎంపిక చేశారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఎస్‌హెచ్‌ఓ దేవయ్యతోపాటు ఇతర సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించారు. వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించడం, పోలీసుల పట్ల నమ్మకం కలిగేలా చేయడం, ప్రజలకు సత్వర సేవలు అందించడాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సత్వర సేవల్లో మూడో స్థానం కేటాయించారు. ఈ పోలీస్‌స్టేషన్ సిబ్బందిని సీపీ శ్రీనివాస్, ఐజీ ప్రత్యేకంగా అభినందించారు.



బెల్లంపల్లిలోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్

త్వరలో సీఎంతో గిరిజన, ముస్లిం నేతల సమావేశం

● మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న సీతక్క, చిత్రంలో షబ్బీర్ అలీ, వెడ్మ బొజ్జు, తదితరులు

ఈనాడు, హైదరాబాద్ : కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజనులు, ముస్లింల మధ్య శాంతియుత సంబంధాలను పునరుద్ధరించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కోరారు. జైనూర్‌కు చెందిన ముస్లిం, గిరిజన నేతలతో మంగళవారం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మంత్రి సీతక్కతో కలిసి మాట్లాడారు. ఈ నెల 4న చెలరేగిన మతపరమైన అల్లర్ల సమస్యను పరిష్కరించడంపై చర్చించారు. రెండు వర్గాల మధ్య సామరస్యం చెక్కుచెదరకుండా చూసుకోవాలన్నారు. ఈ నెల 28 లేదా 29న సీఎం రేవంత్‌రెడ్డితో గిరిజన, ముస్లిం నేతలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. ఇరువర్గాలు తమ విభేదాలను పరిష్కరించుకుని, శాంతియుత సంబంధాలను పునరుద్ధరించుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో పాల్గొన్న ఇరువర్గాల నాయకులు తమ మధ్య ఎటువంటి విభేదాలు లేవన్నారు. ఒకరి సంప్రదాయాలు, గుర్తింపును మరొకరు గౌరవించుకోవడానికి అంగీకరించారు. ఇటీవల ఉట్నూర్, జైనూర్‌లోని గోండు ఆదివాసీ నాయకులతో సమావేశమైన మంత్రి అక్కడి అంశాలను ఈ సమావేశంలో వివరించారు. మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గిరిజన నేతలతో ఇటీవల సమావేశమైన అనంతరం వివాదానికి గల కారణాలు, శాంతిభద్రతల పునరుద్ధరణకు చేపట్టిన చర్యలను వివరిస్తూ ముఖ్యమంత్రికి తాజాగా నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ దండే విఠల్, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలాచారి, విద్యావేత్త మహబూబ్ ఆలంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

63వ జాతీయ రహదారి విస్తరణకు నిధులు మంజూరు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర రోడ్డు, రవాణా, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీని మంగళవారం దిల్లీలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలు కలిశారు. చెన్నూరు నియోజకవర్గానికి సంబంధించి పలు రహదారులపై మంత్రితో చర్చించారు. 63వ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చెన్నూరు-భీమారం మండలాల సరిహద్దున జోడువాగు వద్ద రోడ్డు విస్తరణకు రూ.100 కోట్లను మంత్రి మంజూరు చేసినట్లు వారు పేర్కొన్నారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లి వాగుపైన వంతెన నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని కోరగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. జోడువాగుల వద్ద రోడ్డు మరమ్మతులకు ఇదివరకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.1.80 కోట్లు మంజూరుచేసినట్లు వారు చెప్పారు.



దిల్లీలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే



విద్యార్థులతో ఏకలవ్య మోడల్ గురుకులం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లి ఏకలవ్య మోడల్ గురుకుల విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సౌరభ్ యాదవ్ తెలిపారు. మంగళవారం పిట్టబొంగరం పంచాయతీ పాటగూడలోని ఏకలవ్య మోడల్ గురుకులంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. లక్షెట్టిపేటలోని మహాత్మా జ్యోతిబాపులే పాఠశాలలో సోమవారం జరిగిన అండర్-19 కుస్తీ పోటీల్లో పదోతరగతి విద్యార్థి పవన్, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి రాథోడ్ సాయికిరణ్ ప్రతిభ కనబరిచారు. వైస్ ప్రిన్సిపల్ రేఖారాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

29న చదరంగం..

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న అండర్-15 ఏళ్ల విభాగం బాలబాలికల ఉమ్మడి జిల్లాస్థాయి చదరంగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి నన్నపు స్వామి, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమురం భీం, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆసక్తి ఉన్న క్రీడాకారులు చరవాణి 98487 36476, 62819 66588 నెంబర్లను సంప్రదించి తమ పేర్లను ఈ నెల 28లోపు నమోదు చేసుకోవాలని సూచించారు.



విద్యార్థినులకు పురస్కారం అందజేస్తున్న ప్రిన్సిపల్ హరిత

కేయూ క్రీడాపోటీలలో విద్యార్థినుల ప్రతిభ

ఉట్నూరు: కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన గురుకుల విద్యార్థినుల క్రీడా పోటీలలో ఉట్నూరు గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ హరిత తెలిపారు. చెస్‌లో విద్యార్థినులు మల్లేశ్వరి, ధ్రుపత, రాశికళ, జ్యోతిలు మొదటి స్థానాన్ని సాధించి సత్తాచాటారు. పరుగు పందెంలో లక్ష్మి, భీంబాయి, లావణ్య, ప్రియాంక, అనిత రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పీడీ మంగ, అధ్యాపకులు, సిబ్బంది వారిని అభినందించారు.

విధుల నిర్లక్ష్యం.. వికటిస్తున్న లక్ష్యం

● పోలీసుల్లో పెరుగుతున్న ఆశ్రిత పక్షపాతం



ఈటీవీ - ఆదిలాబాద్ : పోలీసంటే? న్యాయం, ధర్మం, బాధితుల పక్షం వహించే పవిత్రమైన విధి నిర్వహించేవారు. కానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొంతమంది అధికారుల ఆశ్రిత పక్షపాత వైఖరి ఆ శాఖకే మచ్చ తెచ్చేలా మారుతోంది. రాజకీయ అండదండలు కలిగిన కొందరు పోలీసుల వ్యవహారం ఉన్నతాధికారులకే సవాలు విసిరేలా మారుతోంది. ఇటీవల ఓ అధికారి తన అధికార దర్పంతో బినామీలను ముందుంచి రూ.కోట్లు విలువ చేసే స్థిరాస్తి దందా, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లు, పెట్రోల్ బంక్‌ల నిర్వహణలో తలదూర్చిన వివాదం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లిన విషయం విదితమే. ఆయనతోపాటు తాజాగా మరో అధికారి పాత్రపై ఉన్నతాధికారులు అంతర్గతంగా ఆరా తీశారు. సంబంధంలేని విషయాల్లో కొందరు తలదూర్చటంతో అపవాదును మూటగట్టుకోవాల్సి వస్తోంది.

ఆదిలాబాద్ అక్రమాలు

ఆదిలాబాద్ జిల్లా బోథ్ సర్కిల్ పరిధిలో విధుల నిర్వహణ పట్టుతప్పుతోంది. నిబంధనలకు విరుద్ధంగా జరిగే స్థిరాస్తి వ్యాపారులకు, అంతర్రాష్ట్ర పరిధిలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు మీదుగా సాగే రాకపోకలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. జూద స్థావరాల నిర్వహణ, అక్రమంగా జరిగే గుట్కా విక్రయాల్లో కొందరి పాత్ర ఉన్నట్లు అధికారుల దృష్టికి వెళ్లింది. అలాంటి ఫిర్యాదులపైనే తాజాగా ఇచ్చోడ ఎస్సైని ఆదిలాబాద్ ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు వెలువరించారు.

నిర్మల్ - తేదీ తారుమారు

నిర్మల్ డివిజన్‌లో కొందరి విధి నిర్వహణ ఇష్టారాజ్యంగా సాగుతున్నట్లు బయటపడింది. నిర్మల్ గ్రామీణ మండలంలో మూడు నెలల కిందట కారు - ద్విచక్ర వాహన ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగినప్పుడు కారుకు బీమా లేదు. అప్పుడు కేసు నమోదు చేయలేదు. కారుకు బీమా చేశాక తేదీలు తారుమారు చేసి ప్రమాదం జరిగినట్లు చూపారు. సారంగాపూర్‌లో అనవసర విషయాల్లో తలదూర్చారనే మరో ఆరోపణ తోడవటంతో ఓ ఎస్సైపై సస్పెన్షన్ వేటుపడింది.

మంచిర్యాల - రాజకీయం

మంచిర్యాల జిల్లాలో నాలుగు నెలల కిందటి ఘటన పోలీసుల మధ్య సమన్వయలోపాన్ని బహిర్గతం చేసింది. విధుల్లో సరిగా స్పందించలేదనే కారణంపై ఓ ఎస్సైని బాధ్యతల నుంచి తప్పించడంతోనే సరిపెట్టారే కానీ దాని వెనుక అసలైన వారెవరనేది గుర్తించలేదు. మంచిర్యాలలో ఓపార్టీ ద్వితీయ శ్రేణి నాయకుడిపై ఏడెనిమిది మంది యువకులు దాడి చేసి గాయపర్చటం వెనుక మరో పార్టీ నాయకుల హస్తం ఉందని ప్రచారం జరిగింది. కేసులోని ప్రాధాన్యతను గుర్తించకుండా పోలీసులు మామూలుగా వదిలేశారనే ఆరోపణపై ఓ ఎస్సైను విధుల నుంచి తప్పించి రామగుండం కమిషనరేట్‌కు అటాచ్ చేశారు.

ఆదివాసీ కోటలో

ఆదివాసీకోట ఆసిఫాబాద్‌లో కొంత మంది అధికారుల పాత్ర విమర్శలకు తావిచ్చేలా మారుతోంది. బాధితుల పక్షాన కాకుండా భయభ్రాంతులకు గురిచేసే వారినే వెనకేసుకొస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ఇటీవల కాగజ్‌నగర్ డివిజన్‌లో ఓ సీఐని విధుల నుంచి తప్పించగా, తాజాగా ఆసిఫాబాద్‌లో డీఎస్పీని తప్పించిన విషయం విదితమే. సమస్యలు ఉత్పన్నమైనప్పుడే అప్రమత్తం కావటం తప్పితే అసలు కారణాలు ఆరా తీయడం లేదనే విమర్శలకు తావిస్తోంది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

దహెగాం, న్యూస్‌టుడే : మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన చిట్ట కోటయ్య(58) అనే వ్యక్తి సోమవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఏఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటయ్య 20 ఏళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నెల 20న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. భార్య గమనించి బెల్లంపల్లి ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై వివరించారు.

పోక్సో చట్టం కింద కేసు నమోదు

కౌటాల, న్యూస్‌టుడే : మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం తెలిపారు. మంగళవారం కౌటాల సర్కిల్ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కౌటాల సీఐ రమేష్, ఎస్సైలు మధుకర్, నరేష్‌లు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపుల్లో భర్తపై..

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన రజితను వరకట్న వేధింపులకు గురిచేసిన ఘటనలో భర్త అశోక్‌పై కేసు నమోదు చేసినట్టు గ్రామీణ ఎస్సై మహేందర్ తెలిపారు. కొంత కాలంగా భార్యభర్తల మధ్య వివాదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో భార్య రజిత తన భర్త వేధింపులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అశోక్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

అయిదుగురిపై..

కాగజ్‌నగర్: పట్టణంలోని ఎన్టీయార్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనలో అయిదుగురిపై కేసు నమోదు చేసినట్టు టౌన్ సీఐ తుత్తూరు శంకరయ్య తెలిపారు. ఓ మహిళ తన వ్యక్తిగత వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంపుతున్నారని గత నెల 18న ఇచ్చిన ఫిర్యాదు మేరకు శైలజ, తూడూరు ఈశ్వర్‌లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఆ వీడియో ఎన్టీయార్ చౌరస్తాలోని ఓ వైన్‌షాపులో పనిచేస్తున్న పురుషోత్తం అనే వ్యక్తి వద్ద ఉందంటూ సదరు మహిళ శుక్రవారం అతన్ని నిలదీశారు. దీంతో అక్కడ చోటు చేసుకున్న వాగ్వాదంలో అయిదుగురు వ్యక్తులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. తనపై దాడికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 22న మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పురుషోత్తం, శివగౌడ్, నవీన్‌గౌడ్, భరత్, అవినాష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మంగళవారం శైలజ, తూడూరు ఈశ్వర్, శివగౌడ్‌లను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మిగతా వారిపై విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని జరుగుతుందని సీఐ వివరించారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి.. ఇద్దరికి గాయాలు

బెజ్జూరు, న్యూస్‌టుడే: మండల శివారులోని నాగులమ్మ సమీపంలో మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డ ఘటనలో ఒకరికి తీవ్రంగా మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. మండలంలోని పాపన్‌పేట్ గ్రామానికి చెందిన బుజాడి సంతోష్, శివబిస్వాస్‌లు కాగజ్‌నగర్‌కు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్న క్రమంలో అదుపుతప్పి వరి పొలంలో కిందపడ్డారు. సంతోష్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేట్ అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. బాటసారులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి వివరాలు సేకరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

రెబ్బెన, న్యూస్‌టుడే: మండలంలోని గోలేటి సింగరేణి సీహెచ్‌పీ సమీపంలో జాతీయ రహదారిపై అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం రెబ్బెన పోలీసులు పట్టుకొన్నారు. ఎస్సై దొలకాని చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గోలేటి సీహెచ్‌పీ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో ఆసిఫాబాద్ నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో ఎనిమిది ఎడ్లు ఉన్నాయన్నారు. మహారాష్ట్రలోని గడ్‌చందూర్‌కు చెందిన సులేమాన్‌ఖాన్ సంబంధించిన పశువులను ఎలాంటి అనుమతులు లేకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. అక్రమంగా పశువులను తరలిస్తున్న మహారాష్ట్రకు చెందిన వాహన డ్రైవర్ మెస్రం ప్రతీక్, క్లీనర్ ఎస్ఏ ఆసిఫ్‌తోపాటు పశువుల యజమానిపై కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. వాహనాన్ని సీజ్ చేసి పశువులను వాహనంలో కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించినట్లు చెప్పారు.



ప్రధాన రహదారి కోసిని సమీపంలో బైఠాయించిన మహిళలు

గొలుసు దుకాణాలు మూసివేయించాలని గళమెత్తిన మహిళలు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం గొలుసు దుకాణాలను మూసివేయించాలని డిమాండ్ చేస్తూ మహిళలు రోడ్డుపై బైఠాయించారు. కోసిని, మిత్ర కాలనీల్లో దుకాణాల కారణంగా తాగేవారి సంఖ్య పెరిగిపోతోందన్నారు. కుమురంభీం చౌరస్తాలో పుట్టగొడుగుల్లా వెలిశాయని దుయ్యబట్టారు. మద్యం ప్రియుల ఆగడాలు ఇంటా బయట పెరిగిపోతున్నాయని, సంసారాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణాలను మూసివేయించాలని సివిల్, ఆబ్కారీ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే ఆందోళన బాట పట్టినట్టు తెలిపారు. ఆందోళన కారణంగా గంట సేపు ఇరువైపులా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగజ్‌నగర్ గ్రామీణ ఎస్సై మహేందర్ సందర్శించి వారిని సముదాయించారు. త్వరలోనే దుకాణాలను మూసివేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శతశాతం అక్షరాస్యతే లక్ష్యం: కలెక్టర్



కలెక్టర్ సమావేశంలో పాల్గొన్న జిల్లా అధికారులు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని పాలనాధికారి వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నవభారత అక్షరాస్యత కార్యక్రమం అమలులో భాగంగా జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అదనపు పాలనాధికారి దీపక్ తివారీతో కలిసి పాల్గొన్న కలెక్టర్ నవభారత అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. నిరక్షరాస్యులను గుర్తించేందుకు అవసరమైన వాలంటీర్లను నియమించాలని, ఇందుకు డిగ్రీ విద్యార్థులను ఉపయోగించుకోవాలన్నారు. మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు తమ పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించి వారి వివరాలను నమోదు చేయాలని, గ్రామాలు, మున్సిపాలిటీల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా మార్చేందుకు సెర్ప్, మెప్మా సిబ్బంది కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా మ్యాచింగ్, బ్యాచింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి కృష్ణకుమార్, చిత్రంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ప్రతి వర్షపు చినుకూ విలువైనదే

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : ప్రతి వర్షపు చినుకు విలువైందని, దానిని ఒడిసిపట్టాలని కేంద్ర ప్రభుత్వ జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి పి.కృష్ణకుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, జలశక్తి అభియాన్ ఛైర్మన్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, టెక్నికల్ అధికారి వెంకటగిరిలతో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రతి నీటి చుక్కను రక్షించి భూగర్భంలోకి వెళ్లేలా చూడాలన్నారు. చెక్ డ్యాంలు, కుంటలు, కమ్యూనిటీ సోక్‌పిట్‌లు, ఇంకుడు గుంతలు నిర్మించేలా చూడాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల వ్యవసాయ చేన్లలో, ప్రభుత్వ భూముల్లో చిన్న కుంటల నిర్మాణం, ప్రభుత్వ కార్యాలయాల వద్ద సోక్‌పిట్‌లు నిర్మిస్తున్నట్లు వివరించారు. వాటర్ హార్వెస్టింగ్, వాటర్ కన్జర్వేషన్ కోసం 2,713 పనులు ప్రారంభించగా 2,134 పూర్తి అయినట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నీటి రక్షణ అంశాలపై వివరించారు. డీఆర్డీవో దత్తారావు, డీపీవో భిక్షపతి, గిసంశ డీడీ రమాదేవి, డీఎంహెచ్‌వో తుకారాం, మిషన్ భగీరథ ఈఈ వెంకటపతి, తదితరులున్నారు.

'ప్రశస్త'తో విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యల గుర్తింపు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ఆరోగ్య సమస్యలు, వైకల్యాలను కనిపెట్టి వారికి సరైన వైద్య చికిత్సలు చేయించడాన్ని ఉపాధ్యాయులు బాధ్యతగా భావించాలని జిల్లా ఇన్‌ఛార్జి డీఈఓ ఎం.ఉదయ్‌బాబు సూచించారు. జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశస్త యాప్ కార్యక్రమ అమలుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్య సమస్యల గుర్తింపుకోసం ప్రశస్త కార్యక్రమాన్ని అమలు పరుస్తోందన్నారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు 60 ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయడం ద్వారా వారిలోని రుగ్మతలను గుర్తించాలన్నారు. జిల్లా సైన్సు అధికారి కటుకం మధుకర్, వయోజన విద్యానోడల్ అధికారి నాగరాజు, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు సుభాష్ బాబు, శ్యాంసుందర్, రిసోర్సుపర్సన్ చైతన్యకుమార్, ఐఆర్‌పీ వెంకటరమణ పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళలకు రక్షణ కరవు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ మహిళలకు రక్షణ కరవైందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రోజు రోజుకు మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన సంఘటన బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి జరకుండా రక్షణ కల్పించాలన్నారు. ఈ నెల 21న ఆదివాసీ బంద్ పిలుపు ఇవ్వగా.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క ఉట్నూర్‌లో కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశాలు, ప్రారంభోత్సవాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తనను పిలవకపోవడం బాధాకరమన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో 1/70, పీసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జైనూర్‌లో 144 సెక్షన్ అమలుతో చాలా మంది పేదలు ఆహారం కోసం ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. వారికి నిత్యావసర సరకులు అందించాలని, నష్టపోయిన వ్యాపారులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. బాధితురాలికి నాణ్యమైన వైద్యంతో పాటు రూ.50 లక్షల ఆర్థిక సాయం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ సర్పంచి మర్సుకోల సరస్వతి, కుమురంభీం మనవడు సోనేరావు, నాయకుడు బుర్స పోచయ్య, తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, తదితరులు

స్వచ్ఛతలో బెల్లంపల్లి ఏరియాను అగ్రస్థానంలో నిలుపుదాం

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: పచ్చదనం, పరిశుభ్రత విషయంలో బెల్లంపల్లి ఏరియాను అగ్రస్థానంలో నిలిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఓటు జీఎం కె.రాజమల్లు పిలుపునిచ్చారు. స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోలేటి కోదండ రామాలయ ఆవరణలో శ్రమదానం చేపట్టారు. అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో కలిసి శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు విడతల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. మొదటి విడత ఈ నెల 30వ తేదీ వరకు సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా చేపట్టాల్సిన పనులు, ప్రదేశాలు గుర్తించాలన్నారు. అక్టోబరు 2వ తేదీ నుంచి 31 వరకు గుర్తించిన పనులను అమలు చేయల్సి ఉంటుందని వివరించారు. కార్యాలయాలతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వచ్ఛత కార్యక్రమానికి ముందు, తర్వాత ఫొటోలు తీయాల్సి ఉంటుందని, కార్యాలయాలు, విభాగాలు పరిశీలించి పరిశుభ్రంగా ఉన్న వాటికి బహుమతి అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కార్యదర్శి ఎస్.తిరుపతి, సివిల్ ఎస్ఈ భాషా, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ఎన్విరాన్‌మెంట్ అధికారి రమేష్, సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్, ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జుపాక రాజేష్ పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు, తదితరులు

కార్మిక వాడల్లో ఫాగింగ్

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లో దోమల నివారణకు సింగరేణి ఆధ్వర్యంలో మంగళవారం ఫాగింగ్ చేపట్టారు. సోమవారం రాత్రి కాలనీలోని పందులు, కుక్కలు, ఆవులు, దోమల సమస్యలను పరిష్కరించాలని కాలనీ మహిళలు రోడ్డెక్కి రాస్తారోకో చేసిన విషయం తెలిసిందే. స్పందించిన సింగరేణి అధికారులు మంగళవారం కార్మిక వాడల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. బెల్లంపల్లి ఏరియా ఎస్ఓటు జీఎం రాజమల్లు వాడల్లో పర్యటిస్తూ సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. కాలనీలో పందుల కళేబరాలను తీయించారు. పందుల యజమానిని పిలిపించి వాటిని తరలించేందుకు చర్యలు తీసుకున్నారు.

సింగరేణి సమాచారం

లాభాల వాటా ఇప్పించిన ఘనత ఏఐటీయూసీదే

గోలేటి టౌన్‌షిప్, న్యూస్‌టుడే: సింగరేణి చరిత్రలోనే సంస్థ ఆర్జించిన లాభాల నుంచి కార్మికులకు లాభాల వాటా ఇప్పించిన ఘనత ఏఐటీయూసీదేనని ఆ సంఘం గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్‌లో సంఘం ఆధ్వర్యంలో ద్వార సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సారి దసరా పండగకు ముందే కార్మికులకు ముఖ్యమంత్రితో మాట్లాడి 33 శాతం లాభాల వాటా ఇప్పించినట్లు చెప్పారు. కాంట్రాక్టు కార్మికులకు తొలిసారిగా లాభాల వాటా రూ.5 వేలు ఇప్పించిన ఘనత తమ సంఘానిదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు బయ్యు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, జుపాక రాజేష్, పిట్ కార్యదర్శి అశోక్, నాయకులు వసీం, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



ద్వార సమావేశంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, నాయకులు

పెరటికోళ్ల పంపిణీ

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిర మహిళా శక్తి పథకంలో భాగంగా.. శ్రీచైతన్య మండల సమాఖ్య పరిధిలోని 56 మంది సభ్యులకు మండల సమాఖ్య కార్యాలయంలో పెరటికోళ్ల పిల్లలను మంగళవారం ఎంపీడీఓ రమేష్ పంపిణీ చేశారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్టు జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి ఎ.రామకృష్ణ తెలిపారు. పిల్లల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలని సభ్యులను ఆదేశించారు.

రిజర్వేషన్ తొలగిస్తామనడం సరికాదు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీ రిజర్వేషన్‌ను తొలగిస్తామని ఆ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ అమెరికా పర్యటనకు వెళ్లే సమయంలో మాట్లాడడం అనైతిక చర్య అని భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా ఇన్‌ఛార్జి తోట అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావులతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీల ద్రోహిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం సరికాదన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. ప్రధాని జన్మదినం పురస్కరించుకొని సేవా పక్వాడాలో భాగంగా అక్టోబరు 2 వరకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26న రౌతసంకెపల్లిలో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి బూత్ పరిధిలో 200 మంది సభ్యత్వం నమోదు చేసే లక్ష్యం నిర్దేశించామన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పలు వ్యాపార సంస్థల్లో సభ్యత్వ నమోదు చేయించారు. మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్, ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాష్, నాయకులు పెంటు, శంకర్, వెంకటేష్, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



యాంటీ రిజర్వేషన్ కాంగ్రెస్ ప్రతిని ప్రదర్శిస్తున్న భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అజయ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగేశ్వర్‌రావు

ఉపాధ్యాయుల సర్దుబాటుకు చర్యలు

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయనున్నట్లు ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.ఉదయ్‌బాబు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లాలోని ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయ సిబ్బంది వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో ప్రధానోపాధ్యాయులు వెంటనే అందజేయాలని సూచించారు. విద్యాశాఖ మార్గదర్శకాల మేరకు ఉపాధ్యాయుల సర్దుబాటు జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు సంబంధిత సమచారం అందజేశారు.

నెలాఖరు నాటికి ఇంటింటి సర్వే పూర్తి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఓటరు జాబితాల ఇంటింటి సర్వే ఈ నెల చివరి వరకు పూర్తి అయ్యేలా చూస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి ఇతర ఎన్నికల అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, సబ్ కలెక్టర్లు, అదనపు కలెక్టర్‌లు, ఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టరేట్‌లో కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో బూత్‌స్థాయి అధికారులు సమన్వయంతో ఇంటింటి ఓటరు జాబితా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. తాళం వేసి ఉన్న ఇంటికి బూత్ స్థాయి అధికారులు రెండో సారి వెళ్లి సర్వే చేసేలా పర్యవేక్షిస్తునట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, చిరునామా, ప్రదేశాల మార్పుపై భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కలెక్టరేట్ ఏవో మధుకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

వాంకిడి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవాపథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సురేందర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవా దృక్పథాన్ని అలవర్చుకుని సామాజిక సేవ కోసం పాటు పడాలన్నారు. ఎన్ఎస్ఎస్‌లో చేరడం మూలంగా మన చుట్టూ ఉన్నా సామాజిక అంశాలపై అవగాహన ఏర్పడి జీవితంలో ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్‌కుమార్, తిరుపతి, సంతోష్, సత్యం, అశ్విని, శ్రీకాంత్ విద్యార్థులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: సమాజసేవలో విద్యార్థులు ముందుండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సతీష్ తెలిపారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే సమాజసేవకు అంకితం కావాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రకాష్ మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, విద్యార్థిదశ నుంచే వీటిని అలవాటు చేసుకోవాలని వివరించారు. అధ్యాపకులు జయంతి, సత్యనారాయణ, అశోక్, దివ్య తదితరులున్నారు.

అప్రోచ్‌రోడ్డు పూర్తికాక.. ఇక్కట్లు!



పెంచికల్‌పేట్ పెద్దవాగు వంతెన సమీపంలో ఏర్పడిన గుంత

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: పెంచికల్‌పేట్ మండలంలోని పెద్దవాగు వంతెన అప్రోచ్ రోడ్డు పూర్తి కాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై ఒర్రెను తలపిస్తోంది. రాత్రి వేళలో వాహనాలు అదుపు తప్పి అందులో పడిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. అధికారులు స్పందించి అప్రోచ్ రోడ్డు పూర్తి చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ఆసిఫాబాద్ ఎఫ్ఏసీ డీఈవోగా యాదయ్య

ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.యాదయ్యకు కుమురం భీం జిల్లా విద్యాశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నెల 23న ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన ఇక్కడ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ఇక్కడ ఇప్పటి వరకు డీఈవో(ఎఫ్ఏసీ)గా పనిచేసిన పార్శి అశోక్ దీర్ఘకాలిక సెలవులో వెళ్లడంతో ఆయన స్థానంలో యాదయ్యకు పూర్తి అదనపు బాధ్యతలు ఇస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు.

ఆసిఫాబాద్ ఎంఈవోగా ఉదయ్‌బాబు

ఆసిఫాబాద్ అర్బన్: ఆసిఫాబాద్ మండల విద్యాధికారి(ఎఫ్ఏసీ)గా జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉదయ్‌బాబును నియమిస్తూ మంగళవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు విడుదల చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న మండల విద్యాధికారి పోస్టులను ప్రభుత్వ, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

25 నుంచి వయోవృద్ధుల వారోత్సవాలు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 25వ తేదీ నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25న కలెక్టర్ చేతుల మీదుగా వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ ఉంటుందన్నారు. 26న వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకథాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం-2007, ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు, 29న మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన, 30న అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాండ్ పేరెంట్స్ డే, అక్టోబర్ 1న జిల్లా స్థాయి ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

ఏజెన్సీ ప్రాంతాల సభ్యులపై చిన్నచూపు తగదు

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా కమిటీలో ఏజెన్సీ ప్రాంతాల సభ్యులపై చిన్నచూపు చూస్తున్నారని ఆ సంఘ సభ్యులు ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో జరిగిన జిల్లా సంఘం ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారికి ప్రాధాన్యం ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఒకే ప్రాంతానికి చెందిన వారికి రెండు కీలక పదవులు ఇవ్వడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మండల కమిటి అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. సభ్యులు దత్తు, రవీందర్, సురేఖ, లక్ష్మీకాంత్, శివప్రసాద్, రవితేజ, వినోద్ కుమార్, యువరాజ్, జంగు, మోహన్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ ఎదుట వ్యక్తి బైండోవర్

సిర్పూర్(టి): సిర్పూర్(టి) నాగమ్మ చెరువు వద్ద ప్రధాన రహదారి పక్కన సోమవారం రాత్రి టేలా ఏర్పాటు చేసి కబ్జా చేయడానికి ప్రయత్నించిన షేక్ అమ్రాన్‌ను.. మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్సై కమలాకర్ తెలిపారు. భవిష్యత్తులో ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు

కాగజ్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎన్జీఓ కాలనీ పంచాయతీ, వంజీరిలో మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్పీఎం స్పర్శ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు. సేకరించిన చెత్తను బస్తాల్లో నింపి తరలించారు. సంస్థ ప్రతినిధి రీనాబిల్వాల్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్జీఓ కాలనీలో జరుగుతున్న కార్యక్రమాలను ఎంపీడీఓ రమేష్ పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి సునీల్, వంజీరి కార్యదర్శి శ్వేతారాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సందర్శించి.. సమస్యలు తెలుసుకొని

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని అంకుసాపూర్‌లో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలను మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి సందర్శించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలు, బోధకుల కొరత తదితర అంశాలను ప్రిన్సిపల్ డా.సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలో కొత్త విద్యార్థుల ప్రవేశం నేపథ్యంలో పూర్తి స్థాయిలో బోధకులు ఉండేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామన్నారు. మాజీ సర్పంచి మర్సుకోల సరస్వతి, ఆదివాసీ నాయకుడు బుర్స పోచయ్య ఉన్నారు.

గుర్తించి.. చరవాణి అప్పగించి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : పోగొట్టుకున్న చరవాణిని గుర్తించి బాధితుడికి అప్పగించినట్లు ఆసిఫాబాద్ సీఐ సతీష్ తెలిపారు. మండలంలోని బూరుగూడకు చెందిన అశోక్ మార్చిలో చరవాణి పోయినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి మంగళవారం బాధితునికి అందించామన్నారు.

కేజీబీవీల్లో ఉపాధ్యాయులను నియమించాలి

ఆసిఫాబాద్, న్యూస్‌టుడే : జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేను కలిసి వినతి పత్రం అందించారు. కేజీబీవీలకు చెందిన కొందరు బోధకులు ఇటీవల జరిగిన గురుకుల పోస్టుల్లో నియమితులైనట్లు చెప్పారు. దీంతో ఖాళీలు ఏర్పడి విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టికానంద్, కార్యదర్శి కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు భీంరావులు ఉన్నారు.

సోమిని ఆశ్రమోన్నత పాఠశాలలో వైద్యశిబిరం

బెజ్జూరు, న్యూస్‌టుడే : మండలంలోని సోమిని ఆశ్రమోన్నత పాఠశాలలో పెంచికల్‌పేట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 130 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రక్తనమునాలు సేకరించారు. వైద్యుడు సతీష్ వ్యక్తిగత శుభ్రత పాటించాలని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం భిక్షమయ్య, సీహెచ్‌వో అనర్తీ హల్దార్, హెల్త్‌అసిస్టెంట్ ధర్మారావు, ఫార్మసిస్టు రమేష్, ఏఎన్ఎంలు లక్ష్మి, మీరా, సునీత తదితరులున్నారు.

నాలుగు కాళ్లతో కోడిపిల్ల జననం

పెంచికల్‌పేట్, న్యూస్‌టుడే: సాధారణంగా కోడికి రెండు కాళ్లు ఉంటాయి. మండలంలోని కొండపల్లిలో ఓ కోడి పిల్ల మాత్రం నాలుగు కాళ్లతో జన్మించింది. గ్రామానికి చెందిన చౌదరి గంగయ్య కొంతకాలంగా కోడిని పెంచుకుంటున్నారు. మంగళవారం ఓ కోడిపెట్ట 9 పిల్లలకు జన్మనివ్వగా. . ఇందులో ఒక దానికి నాలుగు కాళ్లు ఉన్నాయి. ఈ విషయమై పెంచికల్‌పేట్ పశువైద్యాధికారి రాకేష్‌ను వివరణ కోరగా.. జన్యులోపాలతో నాలుగు కాళ్లు ఉన్న కోడి పిల్లలు అరుదుగా జన్మిస్తుంటాయని తెలిపారు.

